ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 15 ఫిబ్రవరి 2025





మీసేవలో దరఖాస్తులు చేసుకుంటున్న లబ్ధిదారులు

మళ్లీ 'రేషన్' దరఖాస్తులు



- మీ సేవా కేంద్రాలకు లబ్ధిదారుల పరుగులు
- కొత్తవారే దరఖాస్తులు చేసుకోవాలంటున్న అధికారులు
- పదేళ్ల ఎదురుచూపుల్లో మళ్లీ నిరాశే
- జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్
- కుల గణన సర్వేలో 9,731 కుటుంబాలు మాత్రమే గుర్తింపు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఏన్నో ఏండ్లుగా రేషన్ కార్డుల జారీ లబ్ధిదారులు, అర్హులను ఊరిస్తూనే ఉంది. జనవరిలో కులగణన సర్వేలో రేషన్ కార్డుల లబ్ధిదారులను గుర్తించి జాబితాలను గ్రామసభల్లో ప్రదర్శించారు. ఇందులో చాలామంది పేర్లు రాకపోవడంతో అయోమయం చెందారు. ఆందోళన కలిగిస్తున్న క్రమంలో లబ్ధిదారులకు మీ సేవా ద్వారా మరోసారి దరఖాస్తులు స్వీకరించడానికి పౌర సరఫరాల శాఖ అవకాశం కల్పించింది. ఆదేశాలు ఇచ్చిన మొదటి రోజు మీ సేవా కేంద్రాలకు పరుగులు తీసినా వారికి నిరాశే కలిగింది. మళ్లీ తిరిగి వెబ్‌సైట్‌లో ఆప్షన్‌ను పునరుద్ధరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే ఆరు గ్యారంటీల సందర్భంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. గత నెలలో కులగణన సర్వేలో, ప్రతి వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. కానీ జాబితాల్లో పేర్లు లేకపోవడంతో ప్రభుత్వం మళ్లీ మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటించడంతో గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. కుల గణన సర్వేలో ఇచ్చిన ఆన్‌లైన్‌లో చేసిన వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించకపోవడంతో దరఖాస్తుదారులు మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. కొత్త కార్డులకోసం, చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు గ్యారంటీలకు వివిధ ఆప్షన్లతో 1.92 లక్షల దరఖాస్తులు రాగా, 40 వేల మంది రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అందరికి కార్డులు వస్తాయని ఎదురుచూస్తున్న క్రమంలో ప్రస్తుతం ప్రజాపాలన దరఖాస్తుల్లో 25 శాతం మంది పేర్లు మాత్రమే వచ్చాయి. జిల్లాలో గత సంవత్సరం నవంబరు డిసెంబరులో కులగణన సర్వేలో రేషన్ కార్డులు లేని కుటుంబాలను సైతం గుర్తించారు. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9,731 కుటుంబాలు ఉన్నట్లుగా గుర్తించారు. బోయినపల్లి మండలంలో 553, చందుర్తిలో 655, ఇల్లంతకుంటలో 903, గంభీరావుపేటలో 717, కోనరావుపేటలో 836, ముస్తాబాద్‌లో 903, రుద్రంగిలో 314, సిరిసిల్లలో 1420, తంగళ్లపల్లిలో 710, వీర్నపల్లిలో 217, వేములవాడ అర్బన్ మండలంలో 819, వేములవాడలో 421, వేములవాడ రూరల్‌లో 496, ఎల్లారెడ్డిపేటలో 767 కుటుంబాలను గుర్తించి సర్వేలు చేశారు. గతనెల గ్రామసభల్లో అర్హుల జాబితాల్లో పేర్లు లేకపోవడంతో నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఈసారైనా కొత్త రేషన్ కార్డు వస్తుందనే ఆశతో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు.

చేర్పులు మార్పులు పూర్తయ్యేనా..?

జిల్లాలో ప్రస్తుతం లక్షా 73 వేల 728 రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు 4,97,000 మంది ఉన్నారు. ఇందులో ఆహార భద్రత కార్డులు 1,59,760, అంత్యోదయ కార్డులు 13,761, అన్నపూర్ణ కార్డులు 207ఉన్నాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు రాకపోగా, కనీసం ఉన్న కార్డుల్లో ....

మిగతా 8లో..

పొంచి ఉన్న ప్రమాదం..

- భయాందోళనలో ప్రజలు



ప్రమాదకరంగా మారిన వృక్షం

కోనరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారిపై ఎండిన వృక్షం ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రధాన కూడలిలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పెట్టిన చెట్టు వృక్షంగా మారి ఎండిపోయింది. దీంతో ఎండిన వృక్షం తొలగించకపోవడంతో రోడ్డుపై ఎప్పుడు పడిపోతుందోనని వాహనదారులు, గ్రామస్థులు భయపడుతున్నారు. దాని కిందనే విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదం జరగవచ్చని పేర్కొంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఎండిన వృక్షాన్ని తొలగించాలని కోరుతున్నారు.

ఐ స్క్రీనింగ్ పరీక్షలు చేసి లోపాలను గుర్తించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూళ్లలోని పిల్లలకు ఐ స్క్రీనింగ్ పరీక్షలు చేసి లోపాలను గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. శుక్రవా రం కార్యాలయం ఆవరణలో ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో జరిగిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. ఐ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన పిల్లలకు కంటి అద్దాలు ఇవ్వడానికి సిరిసిల్ల ఏరియా ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సంపత్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నయిమా జహా, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవి, వడగాలులు నష్టాల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వేసవి వడగాలుల నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వేసవి వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాన్లు, కూలర్లు, ఎసీలు పని చేస్తున్నాయా లేదా అనే విషయాలను పరిశీలించాలని అన్నారు. మార్చి నుంచి జూలై వరకు ఆశా కార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వడగాలుల వల్ల వచ్చే ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఫైర్‌ఆడిట్ నిర్వహించాలని, సమ్మర్‌కు సంబంధించి జిల్లా, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముఖ్యమైన ప్రాంతాల్లో చల్లని తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. సాంస్కృతిక సారధి కళాకారులతో వడగాల్పులపై ప్రచారం చేయాలని అన్నారు. జిల్లా అధికారులు ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, జిల్లా వెబ్‌సైట్‌లలో వడగాలుల నుంచి సంరక్షించేందుకు చేపట్టే జాగ్రత్తల గురించి ప్రచారం చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి సమయాలను మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి రజిత, డీపీవో శేషాద్రి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా పౌరసంబంధాల అధికారి వి శ్రీధర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలను తీసుకెళ్లవచ్చు..

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ అయిన 64 వాహనాలను యజమానులు సరైన ధ్రువ పత్రాలు చూపించి తీసుకెళ్లవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న ఆయా వాహనాల యజమానులు 6నెలలలోపు సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లవచ్చన్నారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో యజమానులు తీసుకోకుండా ఉన్న గుర్తు తెలియని వాహనాల్లో 6ఆటోలు, 3కార్లు, 55ద్విచక్రవాహనాలను పోలీసు హెడ్ క్వార్టర్‌కు తరలించామన్నారు. వాహనాలను యజమానులు సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లవచ్చన్నారు. యజమానులు లేకుంటే వారి కుటుంబసభ్యులు వాహనపత్రాలను చూపించి తీసుకెళ్లవచ్చన్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మోటర్ వెహికిల్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 8712656428,9000910619 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళా జడ్జిపై చెప్పు విసరడాన్ని నిరసిస్తూ..

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య జయంతి

- నివాళులు అర్పించిన నాయకులు



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం భూక్య రెడ్డి తండాలో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గిరిజనులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గిరిజనులు అత్యంత వైభవంగా నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆరాధ్య దైవమైన జగదాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ గిరిజన ఐక్య వేదిక నాయకులు బానోతు నరేష్, చేపూరి గంగా ధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మానుక సత్యం, పెంతల శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను సకాలంలో చెల్లించాలి

- పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కిషన్‌యాదవ్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం కోసం సింగిల్ విండో నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించి సింగిల్ విండో అభివృద్ధికి తోడ్పాటును అందించాలని పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ సింగిల్ విండో సర్వసభ్య సమావేశం శుక్రవారం చైర్మన్ జీల కిషన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సింగిల్‌విండో ఆదాయ వ్యయాలు, ఖర్చులను సీఈవో చిలుక గౌరిశంకర్ చదివి వినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ సింగిల్‌విండో పరిధిలో ఉన్న 800మంది రైతులల్లో పంటల రుణాలకు కోసం వచ్చిన రైతులకు రూ.3కోట్ల 80లక్షలను రుణాలు ఇచ్చామన్నారు. సింగిల్ విండో పరిధిలో 280 మంది రైతులకు రైతు రుణామాఫీ జరిగిందని ఇంకా 57 మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ బెజ్జారపు నారాయణగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎరవెళ్లి వెంకటరమణారావు, డైరెక్టర్‌లు సలేంద్రి బాలరాజు యాదవ్, భూక్య కిషన్ నాయక్, మల్లబోయిన రాజేందర్, అదిపెల్లి లక్ష్మీ, ముష్కం లీలా, మంగ కిరణ్‌కుమార్ భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈఈటీ యాప్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ యాప్‌లో విద్యార్థుల పేర్లను 15రోజుల్లోగా నమోదు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ యాప్‌లో విద్యార్థుల పేర్ల నమోదుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్(డీఈఈటీ) యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందులో నమోదైతే విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల అర్హత ప్రకారం ప్రైవేటు రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల వివరాలు తెలుస్తాయన్నారు. నిరుద్యోగులకు, పరిశ్రమలకు వారధిగా ఇది పని చేస్తుందన్నారు. ఐటీఐ, పాలిటె క్నిక్, డీగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీఈఈటీలో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉపాధి పొందే అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఉన్న ఐటీఐ కళాశాలు, ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో పాసైన విద్యార్థుల వివరాలను 15రోజుల్లో డీఈఈటీలో నమోదు అయ్యేలా చూడాలన్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో, ఎంబీఏ, కాలేజీ విద్యార్థులు కూడా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాల న్నారు. ప్రైవేటు రంగంలోనే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఉద్యోగ నోటిఫికేషన్‌లో అర్హత కలిగిన ఉద్యోగాల వివరాలు కూడా విద్యార్థులకు చేరవేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, ఏడీ భారతి, జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్, సంబంధిత అధికా రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్ : ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పథకంలో మంజూరైన నిధులను వినియోగిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, సంబంధిత అధికారులతో పీఎంశ్రీ నిధులతో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ సమగ్రశిక్ష, పీఎంశ్రీ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లాలకు విడుదల చేసిన నిధులను వారంలోగా పూర్తిస్థాయిలో ఖర్చుచేయాలని, పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పనకు ఈ నిధులను వినియోగించాలన్నారు. ఫిబ్రవరి నెలలోనే నిధులను ఖర్చు చేసి వివరాలను సమర్పిస్తే మార్చి మొదటి వారం మూడో విడుత నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న 'కొండూరి'

గంభీరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మహాకాళి ఆలయంలోని అమ్మవారిని శుక్రవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు దర్శించుకున్నారు. అమ్మవారికి వారికి ప్రత్యేక పూజలు చేసి కట్న కానుకలు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ వారు రవీందర్‌రావును సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. రవీందర్‌రావు వెంట సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణరావు, సింగిల్ విండో సీఈవో రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, లక్ష్మణ్, రెడ్డి సంఘం నాయకులు రాజిరెడ్డి, విజయేందర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.



రవీందర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

గోదావరి జలాలతో మెట్ట ప్రాంతం సస్యశ్యామలం

- ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం



గోదావరి జలాలకు పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా గోదావరి జలాల విడుదలతో మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అవుతోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్యలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని కాల్వ వద్దకు చేరుకున్న గోదావరి జలాలకు నాయకులతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్యలు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు పని చేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 9వ ప్యాకేజీ కాల్వ పనులను పూర్తిచేయకపోవడంతో ఈ ప్రాంత రైతులు సాగు చేసిన వరి పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయని అన్నారు. అన్నదాతలకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు విశేష కృషి చేశారని అన్నారు. సాగు నీటి సరఫరాతో ఆయా గ్రామాల్లో పగుళ్లు చూపిన వరి పంటలు చేతికి వచ్చే అవకాశాలున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, రాజేందర్, బాబు, దేవానందం, శంకర్, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, గంగయ్య, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య


భారతపు జల(ఫైల్)

జగిత్యాలరూరల్,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు జల(43) అనేవివాహిత అప్పుల బాధతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపినవివరాల ప్రకారం.. భారతపు జల-శ్రీనివాస్ భార్యభర్తలు కొన్నిరోజులుగా అప్పులబాధతో మన స్తాపం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గతనెల28వతేదీన జగిత్యాలరూరల్ మండలంలోని బాలపల్లి శివారులో గల తమ వ్యవసాయ పొలం వద్ద భార్యభర్తలు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మృతురాలు జల కుమారుడు ఇద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందినతండ్రి శ్రీనివాస్ పరిస్థితి మెరుగుపడగా ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తల్లి జల పరిస్థితి విషమించడంతో కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితివిషమించి శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు..

చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కడెం తిరుమలేష్ (37) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం తిరుమలేష్ ఈనెల 11న తన పనిలో భాగంగా తన స్వగ్రామం తిమ్మాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపై కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఇబ్రహీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వరపేట గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరద కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు శుక్రవారం గుర్తించారు. వరద కాలువకు అనుకోని ఉన్న పంపుహౌజ్ ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. వ్యక్తి ఒంటిపై లేత వంకాయ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న..

కాపర్‌వైర్ దొంగల అరెస్ట్


పట్టుపడిన కాపర్ వైర్ దొంగలు

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వరుస కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్నినెలలుగా రామగిరి, మంథని అంతర్గాం మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఊరికి దూరంగాఉంటున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎంచుకొని అందులోని కాపర్‌వైర్‌ను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన మోటం దేవేందర్, మోటం రాంబాబు, సజ్జశిరీష, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన ఇప్ప గంగాధర్, పరతం రాములును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 35 కిలోల కాపర్‌వైర్, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చంపుతానని బెదిరించిన

నలుగురిపై కేసు నమోదు

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన ఎండీ మజీద్‌ను చంపుతామని బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య శుక్రవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 12న మజీద్‌ను మండలంలోని చెందోళి గ్రామానికి చెందిన కటారి వంశీ, అశ్విన్ రావు, గుల్లకోట సత్యం, దావు తిరుపతి అనే నలుగురు వ్యక్తులు ఫోన్‌లో తిట్టారన్నారు. చిల్వాకోడూర్ ఎక్స్ రోడ్డు వద్దకు వచ్చి బాధితుడిని బూతులు తిడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో

వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి అనే వ్యక్తికి డ్రంకెన్ డ్రైవ్‌కేసులో వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులకు పట్టుబడగా జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. గత సంవత్సరం డిసెంబరు 28న చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులో ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ తిరుపతి పట్టుబడ్డాడు. అతడికి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 550/120 ఎంఎల్ రీడింగ్ రావడంతో అతడిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు తిరుపతిని కోర్టులో హాజరు పరచగా ఈ మేరకు స్పెష్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.


చెక్ పోస్టు తనిఖీ


చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలోభాగంగా కలెక్టర్ ఆదేశాలమేరకు కల్వచర్ల ప్రధాన రహదారి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎస్ఐ చంద్రకుమార్‌లు సంయుక్తంగా తనిఖీ చేపట్టారు. అనంతరం రికార్డులను తనిఖీ చేపట్టారు.

కూలీలకు వరం జన్‌మన్ నరేగా

- అరచేతిలో ఈజీఎస్ సమాచారం
- అందుబాటులోకి కొత్త యాప్
- పారదర్శకత, నిధుల దుర్వినియోగానికి చెక్

చొప్పదండి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పారదర్శకతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉపాధిహామీ కూలీలకు అందుబాటులో ఉండేలా దీనిని రూపొందించారు. ఈ పథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తిగా పారదర్శకత ఉండేలా యాప్‌ను ఏర్పాటు చేశారు. జన్‌మన్ నరేగా పేరుతో వచ్చిన ఈ కొత్త యాప్ కూలీలకు సులభంగా సమాచారం అందేలా తీర్చిదిద్దారు. కూలీలు చేసిన పని, వేతనం వివరాలు, గ్రామాలలో ఉపాధి పనులు యాప్‌లో అందుబాటులోకి రాగా ఉపాది కూలీలకు యాప్ వరంగా మారనుంది.

కూలీల వేతనాల దుర్వినియోగానికి చెక్

ఉపాధిహామీ కూలీలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతున్నాయో తెలియని పరిస్థితి. వేతనాలు రావడం లేదని కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఎంత పనిచేశారో తెలియదు. ఉపాధిహామీ సిబ్బంది రాసిందే పని, వచ్చిందే వేతనం అన్న చందంగా ఉండేది. ఎంత పనిచేశారో ఈ యాప్ ద్వారా కూలీలకు పూర్తిగా తెలుస్తుంది. తద్వారా తమకు ఎంత వేతనం వస్తుందో ముందే కూలీలకు తెలుస్తుంది.

సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లో జన్‌మన్ నరేగా అని టైపు చేయగానే యాప్ వివరాలు వస్తాయి. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఆరు రకాల ఆప్షన్లు ఉంటాయి. మొదట ఆప్షన్‌ను నొక్కగానే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీ, గ్రామం, ఫ్యామిలీ ఐడీ వివరాలను సెలక్ట్ చేసుకోవడంతో పూర్తి వివరాలు వస్తాయి. లేదా కూలీల ఉపాధిహామీ జాబ్‌కార్డు నెంబర్ నమోదు చేయగానే కూలీకి సంబంధించిన వివరాలను కనిపిస్తాయి.

జాబ్‌కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. అటెండెన్స్ ఆప్షన్‌ను ఎంచుకోవడంతో ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు, ఎన్ని రోజులు పనిదినాలు మిగిలి పోయాయనే వివరాలు కనిపిస్తాయి.

దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా చేయాల్సిన పని దినాలు కనిపిస్తాయి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరుమీద క్లిక్ చేయగానే ఎన్ని రోజులు, ఎక్కడ పనిచేశారు. కూలీ ఎంత, ఎప్పుడు వారి ఖాతాల్లో జమ చేశారు, ఏ బ్యాంకులో జమ చేశారనే వివరాలు కనిపిస్తాయి. ఉపాధిహామీ డబ్బులు జమకాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్(ఏబీపీఎస్) లింకు అయిందో లేదో వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ లింకు అయితే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది, లింకు కాకుంటే ఎరుపు రంగులో తప్పు గుర్తు ఉంటుంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇసుకను తరలిస్తున్న గన్నేరువరం మండలం చొక్కరావుపల్లె గ్రామానికిచెందిన కాంపల్లిరవిపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లుపేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్(52) అనే గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ శనివారం సాయంత్రం కల్లుతీయడానికి తాటి చెట్టు పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. గాయాలపాలైన శ్రీనివాస్ గౌడ్‌ను కరీంగనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6900 పలికింది. మార్కెట్ యార్డుకు 16మంది రైతులు 150క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6900, కనిష్ఠ ధర రూ.5400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తాను నిర్జీవం..అవయవాలు సజీవం

- యువ రైతు బ్రెయిన్‌డెడ్
- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు


ముస్కు రాజేందర్‌రెడ్డి (ఫైల్)

ఎండపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి (35) అనేయువరైతు బ్రెయిన్‌డెడ్ కాగా కుటుంబసభ్యులు రైతు అవయవాలను దానంచేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవాడు. ఈనెల 10వతేదీన తల తిరుగుతోందని స్పృహతప్పి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని ఆపరేషన్ చేశారు. అనంతరం వైద్య పరీక్షలకు హైదరాబాద్‌కి పంపించగా అక్కడ పరిశీలించిన వైద్యులు అతడు బ్రెయిన్ డెడ్‌బ అయినట్లు నిర్ధారించారు. ఎనిమిది రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తాను చనిపోయినా ఎనిమిది మంది ప్రాణాలు నిలిపాడు. యువరైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థుడు

ముత్తారం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో తాడిచర్ల బ్లాక్1,2 ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం వందలాదిలారీలలో ఇసుకను తరలిస్తుండడంతో దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కర్రె రాంచంద్రం అనే వ్యక్తి శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపాడు. రహదారిపై మంచం వేసుకొని పడుకొని ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా తాడిచర్ల బ్లాక్1,2 ఇసుకక్వారీ నుంచి వందలాది లారీలతో ఇసుకను తరలిస్తుండడంతో ఇండ్లలోకి దుమ్ముధూళి చేరుతోందన్నాడు. తాగే నీటిలో, తినే అన్నంలో దుమ్ము పడుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. లారీలు రాకపోకలతో రహదారి పూర్తిగా దెబ్బతిని మట్టి రోడ్డును తలపిస్తుందని అన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక క్వారీలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని పక్కకు తప్పించారు.

నకిలీ ధ్రువపత్రాలతో భూ విక్రయం

- 13 మందిపై కేసు నమోదు
- నలుగురు నిందితుల అరెస్టు


నిందితులను కోర్టుకు తీసుకెళ్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇతరుల భూమికి నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించి, తప్పుడు హద్దులు చూపుతూ పలువురికి విక్రయించిన కేసులో ఎస్ఆర్ఎస్‌పీకి చెందిన ఇద్దరు అధికారులతోపాటు మరో 11 మందిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో కేసు నమోదైంది. ఈకేసులో నిందితులుగాఉన్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ కట్ట రాంపూర్‌కుచెందిన సర్వేనంబరు 954లో వావిలాలపల్లికి చెందిన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ఆయన తల్లి సత్యవతి పేరిట 6 ఎకరాల 18 గుంటల భూమి ఉండగా ఇందులో నుంచి 34మందికి 4ఎకరాల వరకు ఇతరులకు విక్రయించాడు. మిగిలిన 2ఎకరాల 18 గుంటల భూమిలో ఎకరం 20గుంటల భూమిని మానేరు బైపాస్ రోడ్డు కోసం ప్రభుత్వం తీసుకుంది. ఇంకా దాదాపు 38గుంటల భూమిమిగిలి ఉంది. ఆయన అమెరికా వెళ్లారు. అదేసర్వే నంబరులో వెంకటేశ్వరరావు భూమిని ఆనుకుని పంతంగి రాంచందర్‌రావుకు 11గుంటల భూమి ఉంది. వెంకటేశ్వరరావు అమెరికాలో ఉంటున్నవిషయం తెలుసుకున్న బల్మూరి రమణారావు, దాసరి బుచ్చిరామిరెడ్డి, మహ్మద్ బషీర్ కలిసి ఒకముఠాగా ఏర్పడి వెంకటేశ్వరరావుకు చెందిన 38గుంటల భూమిని కాజేయాలని పథకం రచించారు. ఈ మేరకు పంతంగి రాంచందర్‌రావు భూమిని అధిక ధరకు కొనుగోలు చేస్తామని ఆశచూపి, 2014లో 41 గుంటల భూమిని 10మంది పేరిట రాంచందర్‌రావుతో తప్పుడు రిజిస్ట్రేన్ చేయించుకున్నారు. వెంకటేశ్వరరావు 2022లో తనభూమిపై ఈసీ కోసం దరఖాస్తు చేయగా 10 మంది పేరిట రిజిస్టేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నో ఆబ్జెక్షన్(ఎన్ఓసీ) సర్టిఫికెట్ ఇవ్వడంలో ఇద్దరు అధికారులు సహకరించారు. దీనిపై బాధితుడైన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేయగా తప్పుడు పత్రాలతో 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ నేరానికి పాల్పడిన రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన పంతంగి రాంచందర్ రావు(83), కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్(54), కట్టరాంపూర్‌కుచెందిన బొల్లవేణి శంకర్ (64), జ్యోతినగర్‌కుచెందిన బల్మూరి విజయ్‌కుమార్(46), గణేష్‌నగర్‌కుచెందిన దేశవాణి శంకర్ (71), జగిత్యాలజిల్లా ఎండపల్లికి చెందిన మంతెన నర్సయ్య(54), కరీంనగర్ రాఘవేంద్రనగర్‌కు చెందిన నందికొండ మురళీధర్‌రెడ్డి(64), తిరుమలనగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసరెడ్డి(40), మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు(50), గణేష్‌నగర్‌కు చెందిన దాసరిసంజీవరెడ్డి(38),దాసరి బుచ్చిరాంరెడ్డి (67)తోపాటు ఎస్ఆర్ఎస్‌పీకిచెందిన ఇద్దరు అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

నిందితుల్లో బల్మూరి రమణారావు, దాసరి సంజీవరెడ్డి, దాసరి బుచ్చిరాంరెడ్డి, మొహమ్మద్ బషీర్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని, ఎస్ఆర్ఎస్‌పీ అధికారులపై విచారణ కొనసాగుతోందని సీఐ వివరించారు.

పూరిగుడిసె దగ్ధం


దగ్ధమైన పూరిగుడిసె

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నుంచి వ్యాపించిన మంటలు పూరిగుడిసెకు అంటుకోవ డంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు గ్రామానికి చెందిన శాఖపురపు లక్ష్మి గృహానికి అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఇంట్లో నగదు 50వేల రూపాయలతో పాటు, సామగ్రి కాలిబూడిద అయిందని బాధిత మహిళ లక్ష్మి తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన నష్టాన్ని అంచనావేసి పైఅధికారులకు నివేదించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామప్రజలు కోరారు.

దళితుడిపై దాడి హేయమైన చర్య


నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ వాహనం నడిపాడని తమిళనాడులో దళిత యువకుడిని అగ్రవర్ణాలవారు రెండు చేతులు నరికి వేయడం హేయమైన చర్య అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. దళితుడిపై దాడికి నిరసనగా జగిత్యాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కొత్త చట్టాలు రూపొందించి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. కేవం ఓట్ల కోసం, సీట్ల కోసం దళితులను వాడుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మద్దెల నారాయణ, తోట జగన్, సూరమల్ల సతీష్, రాజారత్నం, చంద్రయ్య, పుట్ట గంగాధర్, జక్కుల దేవయ్య, నర్ర రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- సిరిసిల్లలో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యవ్యస్థ కుంటుపడిపోయిందని ప్రభుత్వం వెంటనే మంత్రి నియమించడంతో పాటు పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించడంతోపాటు పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్స్ కోసం కళాశాల యాజమాన్యాలు డబ్బులు కడితేనే ఇస్తామని వేధింపులకు గురిచేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అప్పులు చేసి డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్‌లను తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కుమార్, అజయ్, నిఖిల్, సమీర్, సంజయ్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో లాభాలు


- కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్లో డిమాండ్


కాట్రపల్లిలో నాటుకోళ్ల షెడ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గతంలో బంధువులెవరైనా ఇంటికివస్తే పెంచుకున్న కోళ్లను కోసి వండిపెట్టేవారు. కాలక్రమేనా నాటు కోళ్ల పెంపకం కనబడకుండా పోయింది. చాలామంది బ్రాయిలర్‌కోళ్లకు అలవాటు పడ్డారు. అయితే ఇటీవల బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోందని పుకార్లు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ పెరిగింది. ఒక నాటుకోడి గుడ్డును రూ.10 నుంచి 12వరకు విక్రయిస్తున్నాడు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన అల్లి సత్యరాజ్ అనేవ్యక్తి గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచేవాడు. లాభాలు తక్కువ వస్తున్నాయనే ఉద్దేశ్యంతో అదే షెడ్డులో నాటు కోళ్ల పెంపకం ప్రారంభించాడు. ఏడాది క్రితం వెయ్యి నాటు కోళ్లను తీసుకురాగా, లాభాలు వచ్చాయి. దీంతో మళ్లీ నాటు కోడి పిల్లలను తీసుకువచ్చి పెంచుతున్నాడు. ఈ కోళ్లకు ఆహారంగా దానతో పాటు పచ్చి కారాగాయంలు అందిస్తున్నాడు. మార్కెట్‌లో కిలో నాటుకోడి రూ.400 పైన ఉన్నా ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. హుజూరాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాల ప్రజలు వచ్చి నాటుకోళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఈకోళ్ల బాగోగులు చూసుకోవడం కోసం ఇద్దరు పనివారిని పెట్టుకున్నాడు. ఈపెంపకం గురించి తెలియడంతో ఇతర ప్రాంతాల నుంచి ఆసక్తిగల పౌల్ట్రీ రైతులు వచ్చి సత్యరాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

వెయ్యి నాటు కోళ్లు పెంచుతున్నా..

- అల్లి సత్యరాజ్, పౌల్ట్రీ రైతు, కాట్రపల్లి



నాటు కోళ్ల పెంపకంతో లాభాలు వస్తున్నాయి. గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచడంతో ఆర్థికంగా నష్టపోయాను. ప్రస్తుతం వెయ్యి నాటు కోళ్లను పెంచుతున్నాను. మరో 15రోజుల్లో ఇంకో వెయ్యి కోళ్లను పెంచేందుకు షెడ్లను ఏర్పాటు చేస్తున్నాను. నాటు కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో కోడి రూ.400లకు విక్రయిస్తుండగా, గుడ్డును రూ.10నుంచి 12కు విక్రయిస్తున్నాను.



సుల్తానాబాద్‌లోని పెరికెగిద్ద అంజన్న ఆలయం

అంజన్న భూములు పక్కదారి

- ఆలయ భూముల్లో మున్సిపాలిటీ పాగా
- గోశాల పేరిట మరి కొందరి ఆధీనం
- ధూపదీప నైవేద్యం స్కీంకు నోచుకోని అర్చకుడు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): అంజన్న ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాదాయశాఖ అధికారుల ఉదాసీనత వల్ల ప్రభుత్వ పరమయ్యాయి. ఆలయానికి భూములు ఉండడంతో అర్చకుడికి ధూపదీప నైవేద్యం స్కీంకు నోచుకోవడం లేదు. దాతలపై ఆధారపడి అర్చకులు కాలం వెళ్లదీస్తున్నారు. మున్సిపాలిటీ కొన్ని ఎకరాలను అనధికారికంగా తమ ఆధీనంలోకి తీసుకొంది. అందులో మామిడి తోట పెట్టారు కానీ ఏనాడూ ఆదాయం సమకూరిందీ లేదు. పూత, కాత లేదంటూ వచ్చిన ఫల సాయం కూడా మున్సిపాలిటీ వారే పంచుకుంటున్నారు.

సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద ఆంజనేయ స్వామి ఆలయం గతంలో ప్రాచుర్యంలో ఉండేది. 1961లో అప్పటి పుర ప్రముఖులు ఆకుల మల్లయ్య, నారాయణ, సాదుల వెంకటనర్సయ్య తదితరులు సర్వే నంబరు 779లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంత దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తి చేశారు. ఆలయ పరిధిలో దాదాపు పది ఎకరాలకు పైగా భూములు ఉండేవి. భూముల సాగు ద్వారా ఆలయ నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఆలయం ఊరికి దూరంగా ఉండడం, ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురైంది. దీంతో క్రమంగా ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. భూములు పెద్ద ఎత్తున ఉండడంతో నాలుగు ఎకరాలలో స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. దాన్ని సాకుగా తీసుకుని కొందరు భూములను తమ ఆధీనంలోకి తీసుకు న్నారనే ఆరోపణలున్నాయి. 2016లో అప్పటి ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టడంతో ఐదు ఎకరాల అంజన్న భూములను తీసుకున్నారు. ఇప్పటికి మున్సిపాలిటీ ఆధీనంలోనే భూములున్నాయి. ఈ విషయంలో దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయం ముందున్న రోడ్డు, ఐసీడీఎస్ ఆఫీసు పక్కన ఉన్న మంచినీటి బావి కూడా ఆలయ భూముల కిందకే వస్తుంది. ఇలా ఆలయ భూములు పక్కదారి పట్టాయి. ప్రభుత్వ పరంగా ధూప దీప నైవేద్యాల స్కీంలో అర్చకుడికి రావాల్సిన గౌరవ వేతనం రాకుండా ఆలయ భూములు అడ్డుపడుతున్నాయి. కొన్నేళ్లు ఆలయం నిరాదరణకు గురై ధూపదీప నైవేద్యాలకు కూడా నోచుకోలేదు. దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో మళ్లీ భక్తుల రాకపోకలు కొనసాగుతున్నాయి. సంబంధిత దేవాదాయశాఖ అధికారులు జోక్యం చేసుకుని అంజన్న ఆలయ భూములు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయ భూముల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని మామిడిచెట్లు

ఆలయ భూములు పరిరక్షించుకుంటాం

ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి

అంజన్న ఆలయం పరిధిలో పది ఎకరాల వరకు ఉంది. అందులో కొన్ని ఎకరాలు స్మశాన వాటికకు తీసుకున్నారు. అలాగే మున్సిపాలిటీ అనధికారికంగా ఐదెకరాల వరకు తీసుకొంది. ఇటీవల గోశాల పేరిట మరికొంత భూమి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆలయ భూములు లేకుండా పోయాయి. ఐసీడీఎస్ ఆఫీసు పరిధిలోని బావి వరకు, ఆలయం ముందు ఉన్న రోడ్డులో కూడా ఆలయ స్థలం పోయింది. ఆలయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూస్తాం.

చర్యలు తీసుకుంటాం

సుజాత దేవాదాయ శాఖ అధికారిణి

సుల్తానాబాద్‌లోని అంజన్న ఆలయ భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. మామిడితోట పెంచుతున్న భూములు దేవాదాయ శాఖకు చెందినవే. అధికారికంగా తాము ఎవరికీ బదలాయించలేదు. ఇటీవల నోటీసులు కూడా ఇచ్చాం. అర్చకునికి ధూప దీప నైవేద్యం స్కీం ద్వారా లబ్ధి చేకూర్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ఆలయ భూములు కాపాడుకోవాలి

పల్లా మురళి వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్

పెరికి గిద్ద అంజనేయ స్వామి ఆలయానికి పది ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవి ఇతరుల పాలయ్యాయి. ఆలయం, ఆవరణ మాత్రమే గుడి పరిధిలో ఉన్నాయి. మిగతా ఎకరాల కొద్దీ భూములు స్మశాన వాటికకని, చెట్ల పెంపకం కోసం అని తీసుకున్నారు. ఆలయ భూములను కాపాడుకోవాలి.

వైభవంగా భీమేశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన జాతర రథోత్సవంతో ముగిసింది. రాయికల్, కోరుట్ల, మేడిపల్లి, మల్లాపూర్, జగిత్యాల మండలాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ సమీప ప్రాంతం కిక్కిరిసింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి క్యూలో నిల బడి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంపైకి చేర్చారు. వేలాది మంది భక్తులు పోటీపడి దేవాలయం చుట్టూ ఐదుసార్లు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

నంబులాద్రి స్వామి రథోత్సవం

జాతరకు కిక్కిరిసిన భక్తులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామం లోని లక్ష్మీ నంబులాద్రి స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మీ నంబులాద్రి స్వామి వారలను మంగళవాయిద్యాలతో, పండితుల వేద మంత్రాలతో, మహిళల మంగళహారతులతో ఆలయ ఆవరణలో సిద్ధంగా ఉన్న రథంపై ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు.

రథంపై ఉన్న స్వామి వారిని, ఆలయం లోపల ఉన్న మూల మూర్తి దర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరారు. ఈ నెల 8న స్వామి వారి కల్యాణోత్సవంతో నంబులాద్రి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారం భమయ్యాయి. శుక్రవారం రథోత్సవం జాతరతో ముగిసాయి. పలు జిల్లాలతోపాటు వైష్ణవ ఆళ్వార్లు ఎక్కువగా ఉన్న తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ఆట్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అన్నదానం, పులిహోర తాగునీటి వసతి కల్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, శ్రీగిరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బాలాజీ రావు, సాగర్‌రావు, సంతోష్‌రావు, సాయిరి మహేందర్, అబ్బయ్య గౌడ్, కుమార్ కిషోర్ తదితరులు పాల్గొని స్వామిని దర్శనం చేసుకున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బా రెడ్డి, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సబ్ డివిజన్ నుంచి పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.



దేవునిపల్లి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథాన్ని లాగుతున్న భక్తులు



ఎస్‌యూ వీసీకి వినతి పత్రం అందజేస్తున్న యూఎస్‌ఎఫ్ఐ నాయకులు

బీఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో రెండు ఫార్మసీ కళాశాలు ఉన్నాయని, ఎక్కువ మంది విద్యార్థులు డిటెన్షన్ అవడం, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు లేకపోవడం వంటి వాటితో ఫార్మసీ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శి సంఘం గణేష్, జిల్లా నాయకులు అభిలాష్, ఉమేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో శుక్రవారం భక్తుల తాకిడి పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులు ముందుగా రాజన్న ఆలయ ధర్మ గుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు అనంతరం శ్రీబద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.





భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా వన మహోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారు ఏకాంతంగా విహార యాత్రకు వెళ్లేందుకు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పండితులు పేర్కొన్నారు. గుట్ట కింది వనంలోకి గజవాహనంపై స్వామివారిని మేళతాలాలతో తీసుకువెళ్లి వనాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనాల వద్ద అటవీశాఖ అధికారులను, అర్చకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, మాజీ జడ్పీటీసీ ముప్పాల జలజ, మాజీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసి స్టెంట్ రఘు, అటవీ శాఖ సెక్షన్ అధికారులు గంగారాం, ప్రకాష్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, అర్చకులు పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా వనమహోత్సవంలో పాల్గొన్న అర్చకులు, పోలీసులు

రాజన్న ఆలయంలో రెండో భారీ ఫ్యాన్



వేములవాడ కల్చరల్ ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం శుక్రవారం రాత్రి ఈవో కె.వినోద్‌రెడ్డి నాగిరెడ్డి మండపం సమీపంలో రెండో భారీ ఫ్యాన్ ఏర్పాటు చేశారు. వేసవి సమీపిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఫ్యాన్ ఏర్పాటు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సన్నాహక సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించడంతో ఫ్యాన్ ఏర్పాటు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈ రామ్ కిషన్‌రావు, పర్యవేక్షకులు వరి నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

రాజన్న కోడె దాడిలో భక్తురాలికి గాయాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలిని శుక్రవారం కోడె గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చి ఎల్లవ్వ అనే వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చింది. కోడె మొక్కు చెల్లించుకునే సమయంలో ఆకస్మాత్తుగా కోడె దాడి చేయడంతో ఎల్లవ్వకు తీవ్ర గాయమైంది. దీంతో 108 ద్వారా ఎల్లవ్వను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎల్లవ్వ ఎడమ కాలికి బలమైన గాయమైనట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. రాజన్న ఆలయానికి కోడెమొక్కుల కోసం తీసుకువచ్చే కోడెలను దాడి చేసేవి కాకుండా సరైన కోడెలను ఎంపిక చేసి ఆలయానికి తీసుకురావాలిని, ఇలాంటి సంఘటనలు ఆలయంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

క్యాన్సర్‌ను దూరం చేద్దాం

- చిన్నారులూ బాధితులే..
- నేడు చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

క్యాన్సర్ ఇప్పుడు మానవాళి ఆరోగ్య సమస్యల్లో ఒకటైపోయింది. ఎంతోమంది క్యాన్సర్ అనగానే జీవితమే ముగిసి పోయిందని మానసికంగా కృంగిపోతారు. శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ రావచ్చు. కొన్ని రకాల క్యాన్సర్‌లను ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు నిలుపుకునే అవకాశం ఉంది. క్యాన్సర్ బారిన పడి పెద్దలే కాకుండా చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. అందుకే క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించి చిన్నారులను రక్షించుకోవడానికి ప్రచార కార్యక్రమాలు కూడా ప్రపంచ వ్యాప్తంగా మొదలయ్యాయి.

క్యాన్సర్ కొంతమంది కుటుంబాల్లో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వారు ముందుగా పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పడడం అవసరమని చెబుతున్నా రు. క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా వందలో 24 సందర్భాల్లో పొట్టల్లో, అన్నవాహికలో వస్తున్నట్లుగా గుర్తించారు. 16 క్యాన్సర్లు ఊపిరితిత్తుల్లో, 15 క్యాన్సర్లు రొమ్ముకు, పేగులకు, ఊపిరితిత్తులకు దాదాపు 55సందర్భాల్లో క్యాన్సర్ వస్తున్నట్లుగా గుర్తించారు. వీటితో పాటు మూత్రకోశం, మూత్రపిండాల్లో 13, చర్మానికి 9, గర్భసంచి, అండాశయాల్లో, మిగతా అవయవాల్లో 14 శాతం క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్ వచ్చిన దాన్ని కనుక్కొని ఆపరేషన్ ద్వారా తొలగించడమనేది ఎంతో ఉపయోగపడుతుంది. ఆ తరువాత రెడియో థెరపీ, మందుల వాడకం వంటివి చేస్తే ఉపయోగం ఉంటుంది. క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంటుంది. పొగ తాగడం మానివేయాలని, పీచు పదార్థాలు ఎక్కువగా తినాలని వైద్యులు చెబుతున్నారు.



ప్రపంచంలో ప్రతి ఏటా 2 లక్షల 50వేల మంది బాలబాలికలు క్యాన్సర్ బారినపడుతున్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశంలో 80శాతం బాలబాలికలు ఉన్నారు. వ్యాధిని గుర్తించకపోవడం వల్ల, తగిన వైద్య సదుపాయం అందకపోవడం వల్ల మృతిచెందుతున్నారు. క్యాన్సర్‌ను గుర్తించి తగిన చికిత్స చేస్తే కనీసం లక్ష మంది బాలబాలికల ప్రాణాలను కాపాడుకునే వీలు ఉంటుంది. అందుకే ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ పేరెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డేగా జరుపుతున్నారు. ఈ రోజున క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు అందుకు అవసరమయ్యే నిధులను కూడా సేకరిస్తారు.





స్తంభంపల్లిలో ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొన్న గ్రామస్థులు

హోరాహోరీగా ఎడ్ల బండ్ల పోటీలు

వెల్గటూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఎడ్లబండ్ల పోటీలు అలరించాయి. ఈ పోటీలో గొల్లపల్లి మండలం శెకల్ల గ్రామానికి చెందిన వెల్గటూర్ రమేష్‌కు చెందిన ఎడ్ల బండి ప్రథమ స్థానంలో నిలువగా అదే గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మణ్‌పావు తులం బంగారం అందజేశారు. జగదేవ్‌పేట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ద్వితీయ స్థానంలో నిలువగా జగిత్యాలకు చెందిన జీజీఎం పవన్ ఎనిమిది తులాల వెండిని అందజేశా రు. షేక్ ఇమ్రాన్, పత్తిపాక పెంటయ్యకు సంబంధించిన ఎడ్ల బండ్లు తృతీయ స్థానంలో నిలువగా స్తంభంపల్లి గ్రామానికి చెందిన పాదం అన్విక్ పటేల్ నాలుగు తులాల వెండిని అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య, కమిటీ సభ్యులు గోరు వంతుల మహేష్, అన్నవేని మల్లేష్, యాగండ్ల రాజయ్య, అన్నవేని వెంకటేష్, రాపాక వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యేడాదిన్నర కాలంలో ప్రజలు, రైతులకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ అనేక సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించారని అన్నారు. రైతు బంధు, రుణ మాఫీ పథకాలను అమలు చేశారని అన్నారు. కాంగ్రెస్ సర్కారు రైతు సంక్షేమాన్ని విస్మరిస్తోందని అన్నారు. యూరియా కోసం బారులు తీరడం కళ్లారా చూస్తున్నామని అన్నారు. గత బీఆర్ఎస్ హయంలో నిర్మించిన శ్రీరాజరాజేశ్వర జలాశయం, మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేసి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కృష్ణహరి సూచించారు. ఈ సమావేశంలో నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి, సందీప్, రాజం, సీత్యానాయక్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి

చందుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మొకిలె విజేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పోంచెట్టి రాకేష్, నాయకులు పేరుక గంగరాజు, చిర్రం తిరుపతి, సంటి మహేష్, దర్రే దీనిష్, గుడిసె గంగరాజు, మాడిపెల్లి రాజిరెడ్డి, గంగాధర్ తిరుపతి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో శరత్‌రెడ్డి, పర్శరాములు, తిరుపతి, సాయిలు, బుగ్గారెడ్డి, నరేశ్, లక్ష్మారెడ్డి, కృష్ణహరి, ప్రదీప్‌రెడ్డి, కిరణ్ నాయక్, రవినాయక్, స్వామి, రాజు, రామచంద్రం, సత్యంరెడ్డి, శ్రీశైలం, ప్రకాశ్, ప్రశాంత్, వేణు, మల్లయ్య, ఎలేందర్, మహేశ్‌బాబు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలే లక్ష్యం..

- వ్యవసాయ భూములను పంచుకుంటున్న ఉమ్మడి కుటుంబాల్లోని సభ్యులు..
- ఏడాదిగా తగ్గిన క్రయవిక్రయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములు పంచుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబాల్లోని సభ్యులు బహుమతులుగా ఇచ్చేస్తున్నారు. ఈ బహుమతులు ఎవరికో ఇవ్వడం లేదు.. ఒకే కుటుంబంలో ఉన్న సభ్యులే పంచేసుకుంటున్నారు. ఓవైపు వ్యవసాయ భూముల ధరలు పెరగడం, మరోవైపు సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు దృష్టిపెట్టారు. మరోవైపు రైతు భరోసాలో లబ్ధి పొందేందుకు వ్యూహాత్మకంగా పంచేసుకుంటున్నారు. అయిదు ఎకరాల లోపు ఉంటే ఏ పథకానికైనా అర్హులుగా ఉండవచ్చనే ఆలోచనతో ముందడుగు వేస్తున్నారు. ఇందుకు రిజిస్ట్రేష న్ శాఖలో గిఫ్ట్‌డీడ్‌ల సంఖ్య పెరగడమే నిదర్శనం. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉమ్మడి కుటుంబసభ్యులందరూ ఎవరి వాటా భూములు వారు పంచుకున్నారు. ప్రధానంగా రైతు భరోసా పథకంలో ఎకరానికి రూ. 12 వేలు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధియోజనలో ప్రతి ఏటా ఒక్కో రైతుకు రూ.10 వేలు, కుటుంబంలో ఒకరికి వృద్ధాప్య పింఛన్‌కు అర్హత సాధించాలంటే ఉమ్మడిగా ఉన్న భూములు పంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా పింఛన్‌కు 57 ఏళ్ల వయస్సుకు కుదించడంతో కుటుంబ సభ్యులకు ఉమ్మడిగా ఉన్న భూములను పంచుకొని గిఫ్ట్‌డీడ్ చేసుకున్నారు.

ఏడాదిలో 4వేలకు పైగా గిఫ్ట్‌డీడ్‌లు

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గత ఏడాదిలో 4 వేలకు పైగా గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి. కొన్నేళ్లుగా కుటుంబంలోని యజమాని పేరిట ఉన్న భూమిని ఒక్కొక్కరికి 2నుంచి 5ఎకరాలకు మించకుండా మిగతా కుటుంబ సభ్యులు పంచేసుకుంటున్నారు. పంచుకున్న భూమిని గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. కుటుంబసభ్యుల్లో ఎవరైనా ఒక డాక్యుమెంట్ గిఫ్ట్‌డీడ్ చేసుకుంటే ఎకరానికి 3శాతం స్టాంపు డ్యూటీ, రూ.2500 మ్యుటేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సంక్షేమ ఫలాలు పొందడానికి కుటుంబ సభ్యుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబంలో యజమాని పేరిట వచ్చే రైతు భరోసాను పంచుకోవడానికి ఇబ్బందులు కావడంతో ఎవరి భూమి వారి పేరిట గిఫ్ట్‌డీడ్ చేసుకుంటున్నారు. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా రైతులకు వారి ఖాతాల్లో డబ్బులను జమ చేయడంతో ఎవరిభూములు వారు పంచుకొని మండల రెవెన్యూ కార్యాలయాల్లో ధరణి పోర్టల్ అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.



సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మందగించిన క్రయవిక్రయాలు..

జిల్లాలో భుముల క్రయవిక్రయాలు మందగించాయి. గత ఏడాదిగా రియల్ ఎస్టేట్ రంగం తగ్గుముఖం పట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాగా ఏర్పడిన తొలి ఏడాది నుంచే రియల్ ఏస్టేట్ రంగం నూతన అధ్యాయానికి తెరలేపింది. అయిదేండ్లలో పరుగులు పెట్టి అంచనాలను మించి పోయింది. ఓ వైపు వైపు క్రయవిక్రయాలు తగ్గడంతో మరో వైపు పట్టణాల్లో డాక్యుమెంట్ టు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌లు మాత్రమే కావడంతో భారీగా పడిపోయాయి. మండల రెవెన్యూ కార్యాలయాల్లోని ధరణి ద్వారానే వ్యవసాయ భూములు సులువుగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ సాగింది. భూ భారతి ప్రక్రియ మొదలు కాలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించినప్పటికీ భూముల ధరలు తగ్గలేదు. త్వరలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

భూముల ధరలకు రెక్కలు..

జిల్లాలో 'రియల్' భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లోనూ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. రియల్ ఏస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల, పుణ్యక్షేత్రమైన వేములవాడలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వాణిజ్యపరంగా ఎకరాకు రూ.50లక్షల నుంచి 3కోట్లవరకు చేరుకుంది. గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలు ఎకరాన రూ.10 నుంచి 40 లక్షల వరకు పలుకుతోంది. ప్రధానంగా గ్రామాల్లో రైస్‌మిల్లులు, ఇతర పారిశ్రామిక ప్రగతి జోరుగా సాగడంతో భూముల ధరలు పెరిగాయి.

లక్ష్యాన్ని మించి ఆదాయం..

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మండల కేంద్రాల్లోని జాయింట్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు లక్ష్యానికి మించి ఆదాయం వస్తోంది. గత అయిదేళ్లలో నిర్దేశించిన ఆదాయంకంటే అధికంగా సమకూరింది. సిరిసిల్ల, వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2022-23లో ఆదాయం రూ.34కోట్లు రాగా, 2023-24లో రూ. 37 కోట్ల ఆదాయాన్ని వచ్చింది. ఇదేకాకుండా అదనంగా మండల రెవెన్యూ కార్యాలయాల్లో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ కావడంతో ఆదాయం మరింత పెరిగింది.

మళ్లీ 'రేషన్' దరఖాస్తులు

(5వ పేజీ తరువాయి)

కొత్త సభ్యులను చేర్చకపోవడం, చేర్పులు, మార్పులు కూడా జరగలేదు. జిల్లాలో చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు 20,606 పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, కోడళ్ల పేర్లు చేర్చాలంటూ వేలాది మంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. చేర్పుల, మార్పుల దరఖాస్తుల పెండింగ్‌లో బోయినపల్లిలో 1,321, చందుర్తిలో 1,760, కోనరావుపేటలో 1,403, ముస్తాబాద్ 1,914, రుద్రంగిలో 948, సిరిసిల్లలో 2,689, తంగళ్లపల్లిలో 1,333, వీర్నపల్లిలో 481, వేములవాడ రూరల్‌లో 1,105, వేములవాడలో 2,105, ఎల్లారెడ్డిపేటలో 2,032 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కొంత మంది మళ్లీ రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు కూడా ఉన్నారు. 2018 సంవత్సరానికి ముందు దరఖాస్తులు చేసుకున్నా వారిలో 2021 ఆగస్టులో 2,271 మందికి రేషన్ కార్డులు అందించారు. ఆ తరువాత మళ్లీ రేషన్ కార్డుల ఆశలు ముందుకు వచ్చాయి.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : కలెక్టర్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంతా ప్రతి సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించేలా నిత్యం సాధన చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూంలోని బియ్యం, ఇతర ఆహార పదార్థాలను సిద్ధం చేసే సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు..

మహిళా జడ్జిపై చెప్పు విసరడాన్ని నిరసిస్తూ..

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా 9వ అడీషనల్ సెషన్స్ జడ్జి హరీషపై కరణ్ సింగ్ అనే నిందితుడు చెప్పు విసరడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. విధులు బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటిలు మాట్లాడుతూ ఫోక్సో కేసులో కరణ్ సింగ్ అనే నిందితుడికి జీవిత ఖైదు విధించిన జడ్జిపై చెప్పు విసరడం అత్యంత బాధాకరమని, న్యాయమూర్తులపై దాడులకు పాల్పడడం అత్యంత హేయమైన చర్య అన్నారు. న్యాయమూర్తులకు న్యాయవాదులుగా అండగా ఉంటామని, ఈ చర్యని నిరసిస్తూ విధులను బహిష్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి బిట్ల విష్ణు, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, క్రీడల కార్యదర్శి కిషన్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● వేములవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా 9వ అదనపు సెషన్స్ జడ్జిపై కరణ్ సింగ్ అనే నిందితుడు చెప్పు విసరడాన్ని నిరసిస్తూ శుక్రవారం వేములవాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ న్యాయమూర్తులపై దాడులకు పాల్పడడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు.



వేములవాడలో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజినీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, వేముల సుధాకర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రేగుల దేవేందర్, పెంట రాజు, గొంటి శంకర్, పిల్లి మధు, కటకం జనార్ధన్, బీమా మహేష్, మాదాసు దేవయ్య, సుంకపాక నవీన్, తాహెర్ పాషా, అనిల్, సుమన్, శ్రీకాంత్, మహేశ్, మమత, పావని తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఉచిత పశువైద్య శిబిరం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. పశువులకు గర్భకోశవ్యాధి పరీక్షలు, నట్టల మందులు తాగించారు. పశువైద్య సహాయకులు లచ్చయ్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాములు, గోపాలమిత్రలు రమేష్, రాజయ్య, రంజాన్, డెయిరీ చైర్మన్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్‌పై శిక్షణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ముస్కానిపేట, రహీంఖాన్‌పేట, వంతడుపుల గ్రామాలలో కాటమయ్య రక్షణ కిట్‌పై శుక్రవారం గీతకార్మికులకు శిక్షణ ఇచ్చారు. గీతకార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్‌ను తీసుకవచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, శ్రీనివాస్, శిక్షకులు జాగిరి అంజయ్య, పొన్నం వెంకటేష్, బత్తిని శ్రీనివాస్, గౌడసంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్యగౌడ్, అంజయ్యగౌడ్, నాగుల చంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండంలోని పొత్తూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వారసంత రోడ్డు బాగాలేదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి దృష్టికి వెళ్ళగా నిధులు మంజూరు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇరుమల్ల నర్సయ్య, ఒట్టె శ్రీకాంత్, బండారి పర్శరాం, నరేష్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాల సేకరణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ కింద పంపిణీ చేసిన భూముల్లో పంటల వివరాల అధికారులు శుక్రవారం సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో దళితులకు మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేశారు. భూములలో ఎలాంటి వసతులు ఉన్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

పుల్వామా అమరులకు నివాళులు

రుద్రంగి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుల్వామా ఘటనలో అమరులైన జవాన్లకు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో రాజీవ్‌నగర్‌కు చెందిన బాలురు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ తీసి జవాన్లకు నివాళులర్పించారు.

డీటీఎఫ్ మండల కార్యవర్గం

చందుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా గుడిమల్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా మిట్ట మహేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు బూర సదానందం, జిల్లా ఎన్నికల అధికారి వంగ తిరుపతి శుక్రవారం తెలిపారు. చందుర్తి ప్రాథమిక పాఠశాలలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించి, మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా కౌన్సిలర్లుగా గుర్రం కృష్ణారెడ్డి, సింగిరెడ్డి జలంధర్ రెడ్డి, గడప రఘుపతిరావు, వంగ తిరుపతి, అంబటి శంకర్, కొమ్ముల జనార్ధన్, గుండబోయిన శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బానోతు రాజు, భాగ్యలక్ష్మి, సెయిల మహేష్, కార్యదర్శులుగా ఈగ శ్రీనివాస్, కొండ రేవతి, ఆవుల లచ్చయ్య, కటుకం అమర్నాథ్, జిందం లక్ష్మణ్, ఆడిట్ కమిటీ చైర్మన్‌గా గర్రిపెల్లి వేణుగోపాల్ సభ్యులుగా మరియాల కార్తీక్‌లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమానికి సంబంధించిన వృక్షార్చన పోస్టర్‌ను శుక్రవారం ఆయన వేములవాడలోని తన నివాసంలో ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా ఈనెల 17న గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


మాతృభాష గొప్పతనాన్ని తెలుసుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. కందికట్కూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ వేడుకలు జరిగాయి. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులు పాల్గొనగా పద్యాలు పాడి ప్రతిభ కనబర్చారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పావణి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, ఉషశ్రీ, స్వప్న, రవీందర్, శ్రీనివాస్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసమే సింగిల్ విండోలు



కోనరావుపేటలో చెక్కులు అందజేస్తున్న చైర్మన్ నర్సయ్య

కోనరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధి కోసమే సింగిల్ విండోలు ఏర్పడ్డాయని కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ అన్నారు. శుక్రవారం మండలంలోని 12 మంది రైతులకు 67 లక్షలు దీర్ఘకాలిక లోన్లు మంజూరు కాగా వారికి చెక్కులను అందజేసి మాట్లాడారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, క్రాప్‌లోన్స్ అందించి రైతులకు అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు అనుపాటి భూంరెడ్డి, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరి, కిషన్‌రెడ్డి, పారల రాజు, బానోత్ అనిల్, భూపతిరెడ్డి, బ్యాంక్ మేనేజర్, రఘునాథ్ శర్మ, సీఈఓ కేశవులు, పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల విధులపై అధికారులకు శిక్షణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల విధులపై మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. రాబోవు జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల కోసం 36మంది పీవోలు, 62మంది ఏపీవోలకు మొదటి విడత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, సూపరిండెంట్ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ గుర్రం సందీప్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎంపీటీసీ, జడ్పీటీసీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాచర్లబొప్పాపూర్ రైతు వేదికలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులపై అధికారులు శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎంపీడీవోలు సత్తయ్య, వాజీద్, ఎంఈవో కృష్ణహరి, సూపరిండెంట్ శ్రీనివాస్, టీవోటీ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవోలకు ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. మర్రిపల్లి రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ తరగతులలో బ్యాలెట్ పేపర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీవో, ఏపీవోలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.





ఇల్లంతకుంటలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్, చందుర్తిలో పాల్గొన్న పీవో, ఏపీవోలు

● కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్ని గ్రామాల పీవో, ఏపీఓలకు మండల అభివృద్ధి అధికారి శంకర్ రెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై మాస్టర్ ట్రైనర్ శ్రీధర్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. సందర్భంగా ఎన్నికల డిస్ట్రిబ్యూషన్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాలెట్ పేపర్లు బ్యాలెట్ బాక్స్ ఇతర ముఖ్యమైన ఎన్నికల విధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు ఆరిఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండవ సాధారణ ఎన్నికలపై చందుర్తి, రుద్రంగి మండలాలకు చెందిన పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్‌రెడ్డి బ్యాలెట్ బాక్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి, రుద్రంగి ఎంపీడీవోలు ప్రదీప్ కుమార్, నటరాజన్, ఎంఈవో వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య జయంతి

- నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



చందుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య బడుగు బలహీనవర్గాలకు ఆశాజ్యోతిగా సంక్షేమ ఫలాలను అందించాడని జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో దామోదరం సంజీవయ్య విగ్రహా ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం పాత బస్టాండ్ సమీపంలో దామోదరం సంజీవయ్య చౌరస్తాలోని సంజీవయ్య విగ్రహానికి జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూప తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఆడగట్ల మురళి, దామోదర సంజీవయ్య విగ్రహ ఆవిష్కరణ కమిటీ చైర్మన్ రాగుల రాములు, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, మాజీ కౌన్సిలర్ రాగుల జగన్, నాయకులు పాటి కుమార్‌రాజ్, జక్కుల యాదగిరి, కమలాకర్, తుంగ శివరాజ్ పాల్గొన్నారు.

● వేములవాడ : దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు బహుజన సేన ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడలో నిర్వహించారు. బహుజన సేన ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ తదితరులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొంపెల్లి విజయ్ కుమార్, రెడ్డిమల్ల భాను తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలకేంద్రంలో తెలంగాణ మాల మహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్, నాయకులు బత్తుల కమలాకర్, సిరిగిరి సుధాకర్, రాగుల సుబ్రమణ్యం, ప్రభాకర్, బాబు, అశోక్, ఆది మల్లయ్య, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించి ఘన నివాళులర్పించారు. మాల మహానాడు జిల్లా బాధ్యులు మల్యాల రాజ్ వీర్, జిల్లా నాయకులు ఎడబోయిన రాజు, ఎగదండి స్వామి, బండ రమేష్, గన్నె నాగరాజు తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను మాల మహానాడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండు ప్రాంతంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రం, సందీప్, నర్సింలు, సూర్యం, రవి, బాలనర్సు, కిష్టయ్య, రాజు, దేవదానం, శ్రీనివాస్, దాసు తదితరులు పాల్గొన్నారు.